సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 4 । జూలై । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 29.041 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 91.324 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.59,980
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,386
3 శాతం జీఎస్టీతో..	రూ.5,548
సవర (8 గ్రా)	రూ.44,384

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.1 /28.6

సోమవారం గాలిలో తేమ 50 శాతం ఉంది. మంగళవారం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. వాతావరణం చల్లగా ఉండే అవకాశం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

బోధన ఇష్టారాజ్యం



కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో సొంత మెటీరియల్‌తో పాఠాలు

- ఎన్‌సీఈఆర్టీ పుస్తకాల వినియోగానికి తిలోదకాలు
- ప్రభుత్వ ఆదేశాలను పాటించని యాజమాన్యాలు
- పుస్తకాల పేరుతో ప్రైమరీ విద్యార్థుల నుంచి రూ.5 వేలు వసూలు
- 7 నుంచి 10 తరగతులకు రూ.10 వేల నుంచి రూ.12 వేలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

నెల్లూరు(టౌన్): కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో బోధనపై ఆయా స్కూళ్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలతోనే బోధన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలను పక్కన బెట్టాయి. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సొంత మెటీరియల్‌ను ముద్రించి బోధన సాగిస్తున్నాయి. జిల్లాలో ఎంపిక చేసిన దుకాణాల్లో పాఠ్యపుస్తకాలను విక్రయించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అంతేకాకుండా ప్రైవేట్ యాజమాన్యాలు సొంత మెటీరియల్ పేరుతో విద్యార్థుల నుంచి వేల రూపాయలు దండుకుంటున్నాయి. జిల్లాలో మొత్తం 926 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 2.87 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఇప్పటి వరకు ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల కోసం జిల్లాలో కేవలం 488 పాఠశాలల యాజమాన్యాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న పరిస్థితి ఉంది. దీనిని బట్టి చూస్తే ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలతో బోధించేందుకు ప్రైవేట్ యాజమాన్యాలు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో సొంత మెటీరియల్‌ను యథేచ్ఛగా విక్రయిస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అందరికీ అందుబాటులో ధరలు

ఎన్‌సీఈఆర్టీ ముద్రించిన పాఠ్యపుస్తకాలు అందరికీ అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ధరలు నిర్ణయించింది. 1వ తరగతికి రూ.399, 2వ తరగతికి రూ.425, 3వ తరగతికి రూ.675, 4వ తరగతికి రూ.702, 5వ తరగతికి రూ.727, 6వ తరగతికి రూ.747, 7వ తరగతికి రూ.871, 8వ తరగతికి రూ.1,181, 9వ తరగతికి రూ.1,167, 10వ తరగతికి రూ.859గా ధరలు నిర్ణయించింది. ఆయా దుకాణాల్లో ఎంఆర్‌పీకి మాత్రమే పాఠ్యపుస్తకాలను విక్రయించాలని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలతో బోధించేందుకు ప్రైవేట్ యాజమాన్యాలు ఆసక్తి చూపడం లేదు.



ఎన్‌సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలు

జిల్లాలో..

- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు - 926
- విద్యార్థుల సంఖ్య - 2.87 లక్షల మందికి పైగా..
- ఎన్‌సీఈఆర్టీ పుస్తకాల కోసం నమోదు చేసుకున్న స్కూళ్లు - 488 మాత్రమే..

అధికారుల పర్యవేక్షణ ఏదీ..?

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేస్తున్న సందర్భాలు ఉండడం లేదు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలను గత నెల 12వ తేదీ నుంచి పునః ప్రారంభించారు. పాఠశాలల్లో గత 20 రోజులుగా తరగతులు నిర్వహిస్తున్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలు కాకుండా సొంత మెటీరియల్‌ను విద్యార్థులకు యథేచ్ఛగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. సొంత మెటీరియల్‌తోనే ఆయా పాఠశాలల్లో బోధన సాగిస్తున్న పరిస్థితి ఉంది. అయితే జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటి వరకు ఒక్క పాఠశాలలో కూడా తనిఖీ చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ యాజమాన్యాలు వ్యవహరిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తామన్న సమాధానం వస్తుందే తప్ప తనిఖీ చేసి చర్యలు తీసుకున్న సందర్భం లేదు. పాఠశాలల రెన్యువల్, ఎన్‌రోల్‌మెంట్ తదితర సందర్భాల్లో వారు అందజేసే మామూళ్లతో అధికారులు సరిపెట్టుకుంటున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సొంత మెటీరియల్‌కు వేలల్లో వసూళ్లు

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సొంత మెటీరియల్‌ను తయారు చేసి విద్యార్థులకు విక్రయించి వేల రూపాయలు దండుకుంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా ప్రైవేట్ యాజమాన్యాలు సొంత మెటీరియల్‌ను ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పాఠశాలల్లో తప్పనిసరిగా పుస్తకాలు కొనుగోలు చేయాలని విద్యార్థులను ఆదేశిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిర్వహించే ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలను మొక్కుబడిగా నిర్వహిస్తూ సొంత మెటీరియల్‌లో ఉన్న సిలబస్‌తో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

నోటీసులు జారీ చేశాం



ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలతోనే అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో బోధన చేయాలి. ఈ పాఠ్యపుస్తకాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేయని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు రెండు రోజుల క్రితం నోటీసులు జారీ చేశాం. ఈ నెల 5వ తేదీ లోపు ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల కోసం 5 శాతం పేమెంట్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. లేకుంటే నమోదు చేయని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

– గంగాభవాని, డీఈఓ

న్యూస్‌రీల్

96.47 శాతం మందికి పింఛన్ల అందజేత



పెనుబర్తిలో లబ్ధిదారు పద్మమ్మకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ కవిత

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. మూడో రోజు సోమవారం 96.47 శాతం మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ కానుక నగదు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 3,04,686 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక అందజేయాల్సిఉండగా 2,93,944 మందికి వలంటీర్లు పెన్షన్ నగదును పంపిణీ చేశారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్, ఎస్పీ



చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్, పక్కన ఎస్పీ, ఏఎస్పీ

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను సోమవారం సాయంత్రం స్థానిక పోలీసు అతిథిగృహంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ డి.హిమవతి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించారు.

జాతీయస్థాయి మేనేజ్‌మెంట్ మీట్ పోస్టర్ల ఆవిష్కరణ



వెంకటాచలం: ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న ద ఫౌంటైన్ హెడ్ జాతీయస్థాయి మేనేజ్‌మెంట్ మీట్-2023 వాల్‌పోస్టర్లను ఆ యూనివర్సిటీలో వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అన్ని కళాశాలల నుంచి డిగ్రీ, పీజీ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, చెంచురెడ్డి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఎస్‌టీసీల ప్రారంభానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్(ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ)లను మండలాల వారీగా ప్రారంభించేందుకు నిరుద్యోగ బీఈడీ, డీఈడీ అభ్యర్థులు, ఆసక్తి గల ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ కోఆర్డినేటర్ ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

నేడు పదోన్నతులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

నెల్లూరు(టౌన్): గుంటూరు జోన్-3 పరిధిలోని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన క్యాడర్లలో పనిచేస్తున్న వారికి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించేందుకు మంగళవారం గుంటూరులోని ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006వ సంవత్సరం మార్చి 31వ తేదీ లోపు విధుల్లో చేరిన స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేడర్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయు లు, 2009వ సంవత్సరం ఫిబ్రవరి 10వ తేదీ లోపు స్కూల్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ ఉపాధ్యాయులు తమ సర్వీస్ రిజిస్టర్స్, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లతో రావాలని తెలిపారు.

జగనన్న కాలనీల్లో పనులు చేపట్టాలి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని జగనన్న కాలనీల్లో నీటి అవసరాలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన బోర్లు ఏర్పాటు చేయాలని, నిర్దేశించిన లక్ష్యం మేరకు క్షేత్రస్థాయిలో పనులు చేపట్టాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, హౌసింగ్ డీఈలు, ఏఈలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణాలకు సంబంధించి నీటి ఇబ్బందులు ఉన్న లేఅవుట్లను గుర్తించి బోర్లు, మోటార్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుదీకరణకు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. స్టేజ్ కన్వర్షన్, రుణాల మంజూరు, సిమెంట్ లభ్యత ఉండేలా చూడడం, సొంతంగా ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకునేలా సూచనలు ఇవ్వడం వంటి అంశాలపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పొదుపు సంఘాల్లో లేని మహిళలను గుర్తించి వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయాలని, గ్రూపు సభ్యులు తక్కువగా ఉన్న గ్రూపుల్లో కొత్త వారిని చేర్పించి రూ.35 వేలు అదనపు రుణాలు అందించాలని మెప్మా, డీఆర్‌డీఏ పీడీలను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, గృహ నిర్మాణ ఇన్‌చార్జి పీడీ నాగరాజు, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, మెప్మా, డ్వామా పీడీలు రవీంద్ర, వెంకట్రావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పండి

ఐదు నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, అందరూ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సోమవారం మనబడి నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, ఐఎఫ్‌పీ డిజిటల్ బోర్డ్స్ తదితర అంశాలపై డీఈఓ, ఎండీఓలు, ఎంఈఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు చదువులకు వెళ్లేలా హెడ్‌మాస్టర్లు, ప్రిన్సిపల్స్ సూచనలివ్వాలని తెలిపారు. 10వ తరగతిలో తప్పిన వారు మళ్లీ 10లో, ఇంటర్మీడియట్ తప్పిన వారికి ఇంటర్‌లో అడ్మిషన్ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో డ్రాప్‌అవుట్స్ ఉండకూడదని తెలిపారు. ఈ నెల 10వ తేదీ లోపు బడి బయట ఉన్న వారి సర్వే పూర్తి చేయాలన్నారు. నాడు–నేడు పనులపై అలసత్వం వహించవద్దన్నారు. సమావేశంలో డీఈఓ గంగాభవాని, సమగ్రశిక్ష అదనపు కో ఆర్డినేటర్ ఉషారాణి, ఎస్‌ఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన

- సీమ్యాట్ డైరెక్టర్ వీఎన్ మస్తానయ్య



నెల్లూరు(టౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సీమ్యాట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వీఎన్ మస్తానయ్య తెలిపారు. నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం డీఈఓ గంగాభవాని, ఏపీసీ ఉషారాణి, ఏడీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న విద్యా సంబంధిత విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 250 మంది హెడ్ మాస్టర్లు, ప్రిన్సిపల్స్‌కు అహ్మదాబాదులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో 5 రోజులపాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారు గత నెలలో విజయవాడలో 300 మంది హెడ్‌మాస్టర్లు, ప్రిన్సిపల్స్‌కు 8 రోజులపాటు శిక్షణ ఇచ్చారని తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 14 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

గురుభ్యోన్నమః

గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం జిల్లాలోని పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ముఖ్యంగా సాయిబాబా, దత్తాత్రేయస్వామి, శ్రీకృష్ణమందిరాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. వేద వాఙ్మయాన్ని మానవాళికి అందించిన వ్యాస మహర్షిని స్మరించుకుంటూ తమ గురువులకు గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు పొందారు.

– నెల్లూరు(బృందావనం)



మనుబోలు: జట్లకొండూరులోని సాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: కోవూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర కోవూరు నియోజకవర్గంలో మొదలుకానున్న ఒక్క రోజు ముందే తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ విజయకుమార్ తన పదవికి రాజీనామా చేసి 50 మంది అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం కోవూరులోని విజయకుమార్ నివాసంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు, లోకేశ్ చేసే పాదయాత్రలు.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనంలా చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు సాటిరావన్నారు. లోకేశ్ యువగళం పాదయాత్ర హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని టీడీపీ సీనియర్ నాయకులు ఊటుకూరు విజయభాను రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, కావలి వెంకటేశ్వర్లు, ఇప్పగుంట సుధాకర్‌రెడ్డి, గండవరం మోహన్‌కృష్ణ, పాశం శ్రీహరిరెడ్డి, చౌకచెర్లకు చెందిన కొమ్మిరెడ్డి మురళీరెడ్డి తదితరులు ఆ పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారని, వీరి చేరికతో టీడీపీ ఖాళీ అయిందని తెలిపారు. విడవలూరు, కొడవలూరు మండలాల్లో కూడా టీడీపీకి కాలం చెల్లిందన్నారు. చంద్రబాబు, లోకేశ్‌లపై నమ్మకం లేక, ఆ పార్టీలో ఉండలేక వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పాలనకు ఇతర పార్టీల నాయకులు ఆకర్షితులై తమ పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీని మరలా గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసా రి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి సముచితస్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీఏపీటీ చైర్మ న్ నిరంజన్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభా గం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, మండల కన్వీనర్ నలబోలు సుబ్బారెడ్డి, హరిప్రసాదరెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, అనూప్‌రెడ్డి, ప్రసాద్, కిశోర్‌సింగ్, చిరంజీవి, అంజనరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా..


- పొదుపు మహిళలకు వ్యక్తిగత రుణాలు
- రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అందజేత
- చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు
- జిల్లాలో వెయ్యి మంది మహిళలను గుర్తించేలా క్యాంపులు
- ఇప్పటి వరకు 300 మంది గుర్తింపు
- సబ్సిడీని వినియోగించుకునేలా చర్యలు

ఇప్పటికే పొదుపు మహిళలు గ్రూపులుగా పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. ప్రస్తుతం ఇందుకు భిన్నంగా మహిళలకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేసి చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకు సంబంధించి అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియను ప్రారంభించారు. జిల్లాలో మొత్తం వెయ్యి మంది పొదుపు మహిళలతో పరిశ్రమలు ఏర్పాటు చేయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నెల్లూరు(పొగతోట): పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న నేపథ్యంలో స్వయం సహాయక గ్రూపుల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు పొదుపు మహిళలకు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంది. మంజూరు చేసిన రుణాలతో మండలాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం మండలాల్లో బ్యాంకు అధికారులు డీఆర్‌డీఏ సిబ్బంది ఆధ్వర్యంలో క్రెడిట్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ క్యాంపు ద్వారా జిల్లావ్యాప్తంగా 1000 మందిని ఎంపిక చేయనున్నారు. అనుభవం, అర్హత ప్రామాణికంగా తీసుకుని, ఎలాంటి సిఫార్సులకు తావులేకుండా ఒక్కో మండలం నుంచి 20 నుంచి 25 మందిని ఎంపిక చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీ వరకు క్రెడిట్ క్యాంపులు నిర్వహించి పొదుపు మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.

ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న అతివలు

జిల్లాలో 38 మండలాలు ఉండగా 4.65 లక్షల మంది పొదుపు మహిళలు ఉన్నారు. వీరు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని తిరిగి సక్రమంగా చెల్లిస్తున్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని చిన్న చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. బ్యూటీపార్లర్, ఐస్ క్రీమ్‌షాప్స్, ఇటుకల పరిశ్రమ తదితర పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో సుమారు 1000 మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారనున్నారు. వీరికి అవసరమైన శిక్షణ తరగతులు, పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకుల నుంచి రుణసదుపాయాన్ని అధికారులు కల్పిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 300 మందికి పైగా పొదుపు మహిళలను అధికారులు ఎంపిక చేశారు. బ్యాంకర్లు తక్కువ వడ్డీతో మహిళలకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేయనున్నారు. ఆ రుణాలతో పొదుపు మహిళలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించనున్నారు.



చేజర్లలో నిర్వహించిన క్రెడిట్ క్యాంప్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి (ఫైల్)

జిల్లాలో..

- మండలాలు - 38
- పొదుపు మహిళలు - 4.65 లక్షల మంది

వెయ్యి మందిని ఎంపిక చేస్తాం

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా మండలాల వారీగా క్రెడిట్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. వెయ్యి మంది పొదుపు మహిళలను ఎంపిక చేస్తున్నాం. పొదుపు మహిళలకు వ్యక్తిగత రుణాలను బ్యాంకుల ద్వారా మంజూరు చేయనున్నాం. దీనికి సంబంధించి మహిళలకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఎంపిక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత రుణాల మంజూరు, పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు

• డీఈఓ గంగా భవాని


మాట్లాడుతున్న డీఈఓ గంగా భవాని

నెల్లూరు(టౌన్): 'ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నాం. వీటిని అందుబాటులోకి తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.' అని డీఈఓ గంగా భవాని తెలిపారు. నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో డిజిటల్ టెక్నాలజీపై ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. వీటిని ఏ విధంగా ఉపయోగించాలి?, విద్యార్థులకు ఎలా బోధించాలి? తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 423 పాఠశాలల్లో 1,324 ఐఎఫ్‌బీ, 428 స్మార్ట్ టీవీలు మంజూరయ్యాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 7,531 మంది ఉపాధ్యాయులు జిల్లా తరగతులకు ఎంపికయ్యారని, ఈనెల 15వ తేదీ వరకు జిల్లాలోని ఏడు ఇంజినీరింగ్ కళాశాలల్లో బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీ డీఈఓ లక్ష్మీప్రసన్న, ఏఎంఓ సుధీర్ బాబు, ఎంఈఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో లోకేశ్ ముఖాముఖి


మహిళలతో సెల్ఫీ దిగుతున్న లోకేశ్

నెల్లూరు సిటీ: నెల్లూరులోని మినీబైపాస్ రోడ్డులో ఉన్న అనిల్ గార్డెన్స్‌లో సోమవారం 'మహాశక్తితో లోకేశ్' కార్యక్రమం జరిగింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే మహిళల వైపు కన్నెత్తి చూడాలన్నా భయపడేలా చట్టాలు అమలు చేస్తామని తెలిపారు. పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

వరికుంటపాడు: ఓ వృద్ధుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తూర్పురొం పిదొడ్ల గ్రామానికి చెందిన పత్రి గురుబ్రహ్మం (71) కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం గ్రామ శివారులోని ఓ తోటలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు ఆయన్ను చికిత్స నిమిత్తం పామూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ శ్రీనివాస్ తెలిపారు.

లోకేశ్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్

• రాజ్యసభ సభ్యుడు మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి
• అల్లూరులో ఇళ్ల పట్టాల పంపిణీ


దివ్యాంగుడికి ఇంటి పట్టా అందజేస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు

అల్లూరు: 'నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయ్యింది. స్థానిక ప్రజలు పట్టించుకోకపోవడంతో ఇతర ప్రాంతాల వారికి డబ్బులిచ్చి తరలిస్తున్నారు. దీనిని బట్టి టీడీపీ ఓటమి ఖాయమని అర్థమవుతోంది.' అని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక రాజులవారి వీధిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని వారు సోమవారం ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇళ్ల పట్టాల పంపిణీ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లూరులో రూ.3.82 కోట్ల విలువైన 12.74 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్ (దయాకర్‌రెడ్డి లేఅవుట్)లో 434 మంది లబ్ధిదారులకు పట్టాలివ్వడం సంతోషంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో ఒక్క సెంటు భూమి కూడా పేదలకు ఇచ్చిన దాఖలాల్లేవన్నారు. లోకేశ్ పాదయాత్రకు జన స్పందన కరువైందన్నారు. అదే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రకు అప్పట్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారని గుర్తు చేశారు. జగన్‌ను ఎదుర్కొనే సత్తా లేకే టీడీపీ పొత్తుల కోసం ప్రయత్నిస్తోందన్నారు.

కావలి అభివృద్ధికి కృషి చేస్తా

బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ కావలి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. సీఎం జగనన్న పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. దీనిని ఓర్వలేని చంద్రబాబు, ఎల్లో మీడియా సంక్షేమ పథకాలపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రసాద్ యాదవ్, వైస్ ఏఎంసీ చైర్మన్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీదేవి, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, మేడా కృష్ణారెడ్డి, షేక్ ఉస్మాన్ షరీఫ్ పాల్గొన్నారు.

ఇంటి పట్టా అందజేత

ఈ కార్యక్రమానికి తోట ఆదివెంకట సత్యనారాయణ అనే దివ్యాంగుడు విచ్చేశాడు. ఆయనకు ఇల్లు లేదు. ప్రభుత్వం స్థలం మంజూరు చేసింది. సభా వేదికపైకి సత్యనారాయణ రాలేదని గమనించిన రామిరెడ్డి, మస్తాన్‌రావు నేరుగా ఆయన వద్దకు వెళ్లి పట్టా అందజేశారు. దీంతో దివ్యాంగుడు సంతోషం వ్యక్తం చేశాడు.

జైల్లో పరిచయం.. జట్టు కట్టి చోరీలు

• నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కేసులు
• ఇద్దరు ఘరానా దొంగల అరెస్ట్
• రూ.9 లక్షల సొత్తు స్వాధీనం


మాట్లాడుతున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పక్కన ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ

నెల్లూరు(క్రైమ్): ఇద్దరూ కరుడుగట్టిన నేరస్తులు.. జైలులో స్నేహితులయ్యారు. బయటకు వచ్చిన తర్వాత జట్టు కట్టి నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో మోటార్‌బైక్, ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. నిఘా ఉంచిన నెల్లూరు వేదాయపాళెం పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. నెల్లూరు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో సోమవారం సాయంత్రం నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ నిందితుల వివరాలను వెల్లడించారు. ఇటీవల నెల్లూరు నగరంలో గృహాల్లో, బైక్ దొంగతనాలు వరుసగా జరిగాయి. దీంతో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఘటనా స్థలాల్లో లభ్యమైన ఆధారాలు, సాంకేతికత ఆధారంగా నిందితులను నెల్లూరు రూరల్ మండల పరిధిలోని బుజబుజనెల్లూరుకు చెందిన షేక్ ఖలీల్ అలియాస్ అబ్బు, ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం మండలం కొండరాజుపల్లి గ్రామం (ప్రస్తుతం తిరుపతి)కు చెందిన కె.సురేష్‌గా గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఇన్‌స్పెక్టర్ నాగమ్మకాలనీ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. నిందితులు తాము దొంగలించిన మోటార్‌బైక్‌లపై చోరీ సొత్తు అమ్మేందుకు వెళ్తుండగా పీవీ నారాయణ తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. విచారణలో నెల్లూరు వేదాయపాళెం, సంతపేట, తిరుపతి జిల్లా చిట్టమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటి, బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు వెలుగు చూసింది. వారి నుంచి రూ.9 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

సిబ్బందికి అభినందన

నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రాబట్టేందుకు కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఎస్సైలు శ్రీనివాసరావు, అంకమ్మ, ఏఎస్సై ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ జి.సుబ్బారావు, కానిస్టేబుల్స్ గోపాల్, నాగరాజు, చినబాబు, గురు మహేష్, శ్రీనివాస్‌ను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారని డీఎస్పీ వెల్లడించారు.

పరిచయమిలా..

షేక్ ఖలీల్ పాతనేరస్తుడు. అతడిపై వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో రౌడీ, సస్పెక్ట్ షీట్లు ఉన్నాయి. గతేడాది పోలీస్ అధికారులు పీడీ యాక్ట్ ప్రయోగించి కడప కేంద్ర కారాగారానికి తరలించారు. ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం మండలం కొండరాజుపల్లికి చెందిన కె.సురేష్ ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఉంటున్నాడు. అతడిపై చాలా కేసులు ఉండడంతో తిరుపతి పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించి కడప కేంద్ర కారాగారానికి పంపారు. అక్కడ ఖలీల్, సురేష్ మధ్య స్నేహం ఏర్పడింది. ఇటీవల నిందితులిద్దరూ జైలు నుంచి బయటకు వచ్చి చోరీలు చేయసాగారు.

నేరాలివే..

• నిందితులు జూన్‌లో తల్పగిరికాలనీలోని ఓ మహిళ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. రూ.5.50 లక్షల విలువచేసే తొమ్మిది సవర్ల బంగారు ఆభరణాలు, ఎల్ఈడీ టీవీని అపహరించుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు.
• తిరుపతి జిల్లా చిట్టమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాకసిరి తిప్పవద్ద ఓ జంటపై దాడి చేసి యువతి మెడలోని రూ.50 వేల విలువ చేసే బంగారు చైన్‌ను దోచుకెళ్లారు.
• తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బజాజ్ పల్సర్ బైక్‌ను అపహరించారు.
• నెల్లూరు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు పల్సర్ బైక్‌లను, ఇంకా సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో హోండా షైన్ బైక్‌ను ఎత్తుకెళ్లారు.

సకాలంలో విచారణ పరిష్కారం

• 'జగనన్నకు చెబుదాం' అర్జీలపై ప్రత్యేక దృష్టి • కలెక్టర్ ఎం.హరినారాయణన్


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి సంబంధించి అర్జీలను సకాలంలో విచారించి తగిన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం ఉదయం హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్వో వెంకట నారాయణమ్మ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. విజ్ఞప్తుల విషయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే వ్యక్తిగతంగా తనిఖీ చేసి సంతృప్తికర పరిష్కారం చూపించాలన్నారు. కార్యక్రమంలో ట్రైయినీ కలెక్టర్ విద్యాధరి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ, మెప్మా ఐసీడీఎస్ పీడీలు కె.సాంబశివారెడ్డి, రవీంద్ర, సౌజన్య, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీపీఓ సుస్మిత, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

• రాష్ట్ర వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక నాయకులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు.
• ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని డీవైఎఫ్ఐ నాయకులు వినతి పత్రంలో పేర్కొన్నారు.

తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలు

• ఉద్యోగాల పేరుతో మోసాలపై అప్రమత్తంగా ఉండాలి
• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ఆస్తి కోసం తల్లిదండ్రులను వేధింపులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 99 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన ఆయా ప్రాంత పోలీస్ అధికారులతో మాట్లాడి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలన్నారు. ప్రధానంగా ఉద్యోగాల పేరిట మోసాలు, పిల్లలు పట్టించుకోవడం లేదని, భార్యాభర్తలు, ఆస్తి గొడవలు, చీటింగ్ కేసులు, దొంగతనం కేసుల్లో దర్యాప్తు, ప్రేమపేరిట మోసం, ఆన్‌లైన్ మోసాలపై ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలిప్పిస్తానని నగదు వసూలు చేసే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల కేసులో సాంకేతికత ఆధారంగా అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి క్షతగాత్రులు/మృతుల కుటుంబాలకు న్యాయం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్పందనలో పాల్గొన్న వారికి మజ్జిగ, భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, డీటీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్, ఏఆర్ డీఎస్పీలు శిరీష, శ్రీనివాసరావు, గాంధీ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, షఫీ, సైబర్ క్రైమ్ ఎస్సై సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించాడు

నేను నెల్లూరు నగరంలోని హరనాథపురంలో నివాసం ఉంటున్నాను. నా చిన్న కుమారుడు డిగ్రీ వరకు చదువుకుని ఖాళీగా ఉన్నాడు. ఈ క్రమంలో హోంగార్డు చంద్ర నా చిన్న కుమారుడికి హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. అందుకు రూ.2.20 లక్షలు ఖర్చవుతుందన్నాడు. దీంతో చంద్రకు రూ.2.20 లక్షల నగదు ఇచ్చాం. నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించలేదు. ప్రస్తుతం అతను ఎక్కడున్నాడో తెలియదు. ఆరాతీయగా పలువుర్ని మోసగించాడని తెలిసింది. విచారించి తగిన చర్యలు తీసుకోవాలి. – మహేశ్వరీబాయి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ఉలవపాడు: ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో మృతిచెందిన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారి వీరేపల్లి జంక్షన్ వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వీరేపల్లి గ్రామానికి చెందిన చిలకపాటి ముసలయ్య (78) భార్యతో కలిసి కావలి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి గుడివాడకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో ముసలయ్య తలకు బలమైన గాయమైంది. దీంతో అదే కారులో ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై బాజిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కందుకూరుకు వెళ్తూ..

వలేటివారిపాలెం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి స్థానిక వెంకటేశ్వర్ మిల్క్ లైన్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కందుకూరు పట్టణానికి చెందిన బోణాల వాసు (55) అనే వ్యాపారి స్కూటీలో వలేటివారిపాళెం వెళ్లాడు. తిరిగి కందుకూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో వెంకటేశ్వర మిల్క్ లైన్ వద్ద స్కూటీ అదుపుతప్పి కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. వాసు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు.

బంగారు హారం బహూకరణ


చైర్మన్‌కు హారం అందజేస్తున్న దాత


బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి దాతలు సోమవారం బంగారు హారాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ చెన్నైకు చెందిన నాయుడు అక్షితారెడ్డి 39 గ్రాముల బరువైన బంగారు హారాన్ని అమ్మవారికి అందజేశారని తెలిపారు. అనంతరం దాతను సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం

కావలి రూరల్: రైలు కింద పడి మారిపోగుల మల్లికార్జున్ (55) అనే వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన కావలి పట్టణంలోని కళుగోళమ్మ గుడి సమీపంలోని రైలు పట్టాలపై సోమవారం జరిగింది. రైల్వే పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కొండాపురం మండలం పొట్టిపల్లికి చెందిన మల్లికార్జున్ ఉపాధి నిమిత్తం ప్రకాశం జిల్లా కొండపిలో ఉంటున్నాడు. స్వగ్రామానికి వెళ్లడానికి తల్లితో కలిసి కావలికి వచ్చాడు. ఆరోగ్యం బాగోలేదని హాస్పిటల్‌లో చూపించుకుని వస్తానని మధ్యాహ్నం తల్లికి చెప్పి కొండాపురం బస్సు ఎక్కించి పంపాడు. అనంతరం కళుగోళమ్మ గుడి వెనుక ఉన్న దిగువ మార్గంలో గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాల మేరకు బంధువులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కాగా మల్లికార్జున్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.26
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 135	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 258
లేయర్ (లైవ్)	: 108		
బ్రాయిలర్ చికెన్	: 232	లేయర్ చికెన్	: 184

సాక్షి బిజినెస్
మంగళవారం
4-7-2023

స్టాక్ మార్కెట్లు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 486	నిఫ్టీ ▲ 134
65,205	19,323

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,817	▲	29
డోజోన్స్	34,418	▲	11
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,527	▽	4
డాక్స్	16,081	▽	67
షాంఘై	3,244	▲	42
నికాయ్	33,753	▲	564

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	57,730
బంగారం (22 క్యారట్)	54,980
వెండి (కిలో)	75,500

సెన్సెక్స్ @ 65000

- 19,300 పైకి నిఫ్టీ
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ఇంధన, ఆర్థిక, మెటల్ షేర్లకు డిమాండ్
- మూడోరోజూ కొత్త రికార్డుల నమోదు



సెన్సెక్స్ మైలురాళ్లు

స్థాయి	అందుకున్న తేదీ
65,000	జూలై 03 2023
64,000	జూన్ 28 2023
63,000	నవంబర్ 30 2022
62,000	అక్టోబర్ 19 2021
61,000	అక్టోబర్ 14 2021

ముంబై: సానుకూల జాతీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో స్టాక్ సూచీల రికార్డు ర్యాలీ సోమవారమూ కొనసాగింది. అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్ ద్వయం షేర్లు రాణించడం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. దేశీయంగా మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు నమోదు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. సెన్సెక్స్ ఉదయం 117 పాయింట్ల లాభంతో 64,836 వద్ద మొదలైంది. నిఫ్టీ 58 పాయింట్లు పెరిగి 19,247 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. తొలి గంట తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే మిడ్‌సెషన్ సమయంలో యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. ఇంధన, ఆర్థిక, మెటల్, ఎఫ్‌ఎంసీజీ రంగాల షేర్లలో అధికంగా కొనుగోళ్లు జరిగాయి. ఇంట్రాడేలో వరుసగా మూడోరోజూ సెన్సెక్స్ 581 పాయింట్లు పెరిగి 65,300 వద్ద, నిఫ్టీ 156 పాయింట్లు బలపడి 19,345 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 486 పాయింట్ల లాభంతో 65,205 వద్ద ముగిసింది. ఈ సూచీకిది వరుసగా నాలుగోరోజూ లాభాల ముగింపు. మార్కెట్ ముగిసేసరికి 134 పాయింట్లు బలపడి 19,323 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్య తరహా షేర్లకూ డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.56%, 0.30% చొప్పున లాభపడ్డాయి. జూన్ వాహన విక్రయాలు అంతంత మాత్రంగా ఉండటంతో ఆటో షేర్లు నష్టపోయాయి. ఐటీ, టెక్, విద్యుత్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 81.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం విలువ రూ.1.73 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ.2.98 లక్షల కోట్లకు చేరింది. ద్రవ్యోల్బణం దిగిరావడంతో కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల సైకిల్‌ను ఆపేయ్యొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ఆసియాలో జపాన్ ఇండెక్స్ నికాయ్ 33 ఏళ్ల గరిష్టం(33,753) ముగిసింది.

''మార్కెట్లో కొనసాగుతున్న ర్యాలీతో పలు షేర్ల వాల్యుయేషన్లు భారీగా పెరిగాయి. నిఫ్టీ ఎఫ్‌వై 24 ఆదాయ అంచనాకు 20 రెట్ల అధిక ప్రీమియంతో ట్రేడవుతోంది. ఇది చరిత్రాత్మక సగటు కంటే ఎక్కువ. ప్రస్తుతం నెలకొన్న సానుకూల పరిస్థితులు మార్కెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే వీలుంది. ఏదైన చిన్న ప్రతికూలాంశం అనూహ్య దిద్దుబాటుకు దారి తీయవచ్చు. కావున పెట్టుబడులు పెట్టేటప్పుడు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించాలి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త వీకే విజయ కుమార్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- విలీనం తర్వాత తొలి ట్రేడింగ్ సెషన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు సానుకూలంగా స్పందించాయి. ఇంట్రాడేలో హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు వరుసగా 4%, 3% చొప్పున ర్యాలీ చేసి రూ.2,926 వద్ద, రూ.1,758 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకాయి. చివరికి హెచ్‌డీఎఫ్‌సీ షేరు 2% లాభంతో రూ.2,871 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు ఒక శాతం పెరిగి రూ.1,719 వద్ద స్థిరపడింది. మొత్తంగా ఈ రెండు కంపెనీల మార్కెట్ విలువ రూ.14.93 లక్షల కోటక్లు పెరిగింది.
- ఎన్‌ఎస్‌ఈలో బ్యాంక్ నిఫ్టీ సూచీ ఏడాది గరిష్టం (45,353) తాకింది. చివరికి ఒకశాతం లాభంతో 45,158 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండెక్స్ సైతం 52 వారాల గరిష్టం(20,398) అందుకొని ఆఖరికి 1% లాభంతో 20,253 వద్ద నిలిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం జీవితకాల గరిష్ట స్థాయి వద్ద ముగిశాయి.

మైక్రోచిప్.. రూ.2,460 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంబెడెడ్ కంట్రోల్ సొల్యూషన్స్‌లో ఉన్న యూఎస్ కంపెనీ మైక్రోచిప్ టెక్నాలజీ భారత్‌లో రూ.2,460 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. కార్యకలాపాల విస్తరణ, ఇంజనీరింగ్ ల్యాబ్స్, నిపుణుల నియామకం, సాంకేతిక కేంద్రాలకు మద్దతు, విద్యా సంస్థలకు ఈ మొత్తాన్ని వెచ్చించనుంది. కాగా, ఇక్కడి కోకాపేట్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న వన్ గోల్డెన్ మైల్ ఆఫీస్ టవర్‌లో 5 అంతస్తులను కంపెనీ కొనుగోలు చేసింది. పరిశోధన, అభివృద్ధి కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చింది. ఈ కేంద్రంలో 1,000 మంది ఉద్యోగులు కూర్చునే వీలుంది. భారత్‌లో కార్యకలాపాలను పెంపొందించడానికి మైక్రోచిప్ ముఖ్యమైన వ్యూహాత్మక నిబద్ధతను ప్రకటించిందని సంస్థ ప్రెసిడెంట్, సీఈవో గణేశ్ మూర్తి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ఇండస్ట్రియల్, డేటా సెంటర్, కంప్యూటింగ్, ఆటోమోటివ్, కన్స్యూమర్ అప్లయాన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాలకు మైక్రోచిప్ సేవలు అందిస్తోంది.

జియో భారత్ ఫోన్ @ రూ. 999

రూ. 123 నెలవారీ ప్లాన్‌తో అపరిమిత కాల్స్, 14 జీబీ డేటా



న్యూఢిల్లీ: టెలికం సంస్థ జియో తాజాగా ఇంటర్నెట్ ఆధారిత చౌక 'జియో భారత్' మొబైల్ ఫోన్లను ఆవిష్కరించింది. దీని ధర రూ. 999. నెలవారీ రీచార్జి రూ. 123గా ఉంటుంది. దీనితో అపరిమిత వాయిస్ కాల్స్, 14 జీబీ డేటా లభిస్తుంది. జూలై 7 నుంచి 10 లక్షల పైచిలుకు జియో భారత్ ఫోన్ల ప్రయోగాత్మక ట్రయల్స్ ప్రారంభమవుతాయని జియో ఒక ప్రకటనలో తెలిపింది. ఇతర ఆపరేటర్లు అందిస్తున్న ఫీచర్ ఫోన్ నెలవారీ ప్లాన్లతో పోలిస్తే 30 శాతం చౌకగా, 7 రెట్లు ఎక్కువ డేటాను యూజర్లు పొందవచ్చని పేర్కొంది. 2జీ విముక్త భారత్ లక్ష్య సాధనను వేగవంతం చేసే దిశగా జియో ఈ మొబైల్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 25 కోట్ల పైచిలుకు 2జీ ఫీచర్ ఫోన్లను వాడుతున్నారని అంచనా. ఒకవైపు ప్రపంచం 5జీ విప్లవం ముంగిట నిల్చుండగా.. 25 కోట్ల మంది ఇంకా 2జీ శకంలోనే చిక్కుబడిపోయి ఉన్నారని, ప్రాథమిక ఇంటర్నెట్ ప్రయోజనాలను కూడా పొందడం లేదని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. డిజిటల్ సమాజంలో.. టెక్నాలజీ ప్రయోజనాలు ఏ కొందరికో పరిమితం కాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జియో భారత్ ఫోన్ మరో ముందడుగని ఆయన పేర్కొన్నారు.

ప్రియం కానున్న టాటా కార్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ధరలను సవరిస్తున్నట్టు ప్రకటించింది. సగటున 0.6 శాతం ధర పెంచుతున్నట్టు సోమవారం వెల్లడించింది. తయారీ వ్యయం పెరగడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్‌తోసహా అన్ని మోడళ్లు, వేరియంట్లకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. కొత్త ధరలు జూలై 17 నుంచి అమలులోకి వస్తాయని టాటా మోటార్స్ తెలిపింది. జూలై 16 వరకు నమోదయ్యే బుకింగ్స్, జూలై 31లోగా జరిగే డెలివరీలకు పాత ధరలు వర్తిస్తాయని వెల్లడించింది

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ ప్రారంభం..

తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల లావాదేవీలు



గాంధీనగర్: సింగపూర్ ఎస్‌జీఎక్స్ నిఫ్టీ స్థానంలో ప్రవేశపెట్టిన గిఫ్ట్ నిఫ్టీలో సోమవారం నుంచి ట్రేడింగ్ ప్రారంభమైంది. ఎస్‌జీఎక్స్ నిఫ్టీకి సంబంధించిన 9.4 బిలియన్ డాలర్ల ఓపెన్ ఇంట్రెస్ట్‌ను గిఫ్ట్ నిఫ్టీకి బదలాయించగా.. మొదటి రోజున తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల విలువ చేసే లావాదేవీల పరిమాణం నమోదైంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో గిఫ్ట్ నిఫ్టీ ట్రేడింగ్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు తమ ట్రేడింగ్‌లో కొంత భాగం విదేశాల్లో జరిగేదని, ఇప్పుడిక పూర్తిగా దేశీయంగానే నిర్వహించవచ్చని నేషనల్ స్టాక్ ఎక్స్చేంజీ (ఎన్‌ఎస్‌ఈ) ఎండీ ఆశీష్ చౌహాన్, ఎన్‌ఎస్‌ఈ ఐఎక్స్ ఎండీ వి. బాలసుబ్రమణియమ్ తెలిపారు.

రెండు సెషన్లలో.. దాదాపు 21 గంటలు..

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్ల మారకంలో జరుగుతుంది. ఉదయం 6.30 గం.ల నుంచి మరుసటి రోజు 2.45 గం.ల వరకు రెండు సెషన్లుగా, దాదాపు 21 గంటల పాటు ఇందులో ట్రేడింగ్ కొనసాగుతుంది. తొలుత గిఫ్ట్ నిఫ్టీ 50, గిఫ్ట్ నిఫ్టీ బ్యాంక్, గిఫ్ట్ నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, గిఫ్ట్ నిఫ్టీ ఐటీ డెరివేటివ్ కాంట్రాక్టులు ఎన్‌ఎస్‌ఈ ఐఎక్స్‌లో అందుబాటులో ఉంటాయి. తర్వాత మరిన్ని సూచీలను క్రమంగా అందుబాటులోకి తెస్తారు. సాధారణంగా దేశీ మార్కెట్ల ఓపెనింగ్‌ను అంచనా వేసేందుకు ట్రేడర్లు ఎస్‌జీఎక్స్ నిఫ్టీని పరిగణనలోకి తీసుకుంటారు.

ఐడీఎఫ్‌సీ బ్యాంకులో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఓకే

ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాతృ సంస్థ ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనం కానుంది. పూర్తిగా షేర్ల మార్పిడి ద్వారా లావాదేవీని చేపట్టనున్నారు. ఇందుకు రెండు సంస్థల బోర్డులూ ఆమోదించినట్లు ఐడీఎఫ్‌సీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తాజాగా వెల్లడించాయి. విలీన ప్రతిపాదన ప్రకారం ఐడీఎఫ్‌సీ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 155 ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు షేర్లు జారీ చేయనున్నారు. ప్రధానంగా మౌలిక రంగానికి రుణాలందించే ఐడీఎఫ్‌సీ 1997లో ఆవిర్భవించింది. 2015లో ఐసీఐసీఐ, ఐడీబీఐ తరహాలో బ్యాంకింగ్ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. 2018 డిసెంబర్‌లో క్యాపిటల్ ఫస్ట్‌ను టేకోవర్ చేసింది.

పవన్ హన్స్ విక్రయం రద్దు

గెలుపొందిన బిడ్డర్ అనర్హత ఎఫెక్ట్



న్యూఢిల్లీ: హెలికాప్టర్ సర్వీసుల పీఎస్‌యూ పవన్ హన్స్ లో వ్యూహాత్మక వాటా విక్రయానికి బ్రేక్ పడింది. బిడ్డింగ్‌లో విజయవంతమైన కన్సార్షియంలోని ఒక కంపెనీపై న్యాయపరమైన వివాదాల రీత్యా అనర్హతవేటు పడటం దీనికి కారణమని దీపమ్ పేర్కొంది. వెరసి పవన్ హన్స్ ప్రయివేటైజేషన్ ప్రయత్నాలకు మూడోసారి చెక్ పడింది. బిడ్‌ను గెలుపొందిన స్టార్9 మొబిలిటీ ప్రయివేట్ లిమిటెడ్ కన్సార్షియంలోని అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీ ఫండ్ ఎస్‌పీసీపై పెండింగ్ కేసుల నేపథ్యంలో ప్రభుత్వం పవన్ హన్స్ డిజిన్వెస్ట్‌మెంట్ నిర్ణయాన్ని రద్దు చేసినట్లు దీపమ్ తెలియజేసింది. భాగస్వామ్య కంపెనీ పవన్ హన్స్‌లో ప్రభుత్వానికి 51 శాతం, ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీకి 49 శాతం చొప్పున వాటా ఉంది.

2018లో షురూ: తొలుత పవన్ హన్స్ లో గల 51 శాతం వాటా విక్రయానికి ప్రభుత్వం 2018లో బిడ్స్‌కు ఆహ్వానం పలికింది. అయితే ఓఎన్‌జీసీ సైతం 49 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధపడటంతో నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. 2019లో తిరిగి కంపెనీలో 100 శాతం వాటా విక్రయానికి బిడ్స్‌ను ఆహ్వానించినప్పటికీ స్పందన లభించకపోవడం గమనార్హం! ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో మూడోసారి పవన్ హన్స్ విక్రయానికి తెరతీసింది. కంపెనీ కొనుగోలుకి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్స్‌ను ఆహ్వానించింది. 2022 ఏప్రిల్‌లో స్టార్9 మొబిలిటీ కన్సార్షియం గరిష్ట బిడ్డర్‌గా నిలిచింది. కన్సార్షియంలో అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీసహా.. బిగ్ చార్టర్ ప్రయివేట్ లిమిటెడ్, మహరాజ ఏవియేషన్ ప్రయివేట్ లిమిటెడ్ సైతం భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1000 మేనేజర్ స్కేల్-2 పోస్టులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో మెయిన్ స్ట్రీమ్ కేటగిరీలో మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1000
- » **అర్హత:** ఏదైనా డిగ్రీ,సీఏఐఐబీ ఉత్తీర్ణులై ఉండాలి. పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్‌ఆర్‌బీలో ఆఫీసర్‌గా మూడేళ్ల పని అనుభవం ఉండాలి(లేదా) పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్‌ఆర్‌బీలో క్లర్క్‌గా ఆరేళ్ల పని అనుభవంతోపాటు సంబంధిత విభాగంలో ఎంబీఏ/ఎంసీఏ/పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 31.05.2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
- » **పే స్కేల్:** నెలకు రూ.48,170 నుంచి రూ.69,810 చెల్లిస్తారు.
- » **పోస్టింగ్ స్థలం:** దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.07.2023
- » **ఆన్‌లైన్ పరీక్ష తేది:**ఆగస్టు రెండు/మూడో వారం
- » **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

ఐబీపీఎస్ 4,045 క్లర్క్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. 2024-25 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్(సీఆర్‌పీ)-XIII.. క్లర్క్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:**4,045 క్లర్క్ పోస్టులు
- » **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీస కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- » **వయసు:** 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష ఉంటుంది. మొదట 100 మార్కులకు ప్రిలిమ్స్, రెండో దశలో 200 మార్కులకు మెయిన్స్ ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి మాత్రమే మెయిన్స్ రాసే అవకాశం ఉంటుంది.
- » **ప్రిలిమినరీ పరీక్ష తేది:**2023 ఆగస్టు/సెప్టెంబర్‌లో
- » **మెయిన్స్ పరీక్ష తేది:** అక్టోబర్ 2023లో నిర్వహిస్తారు
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.07.2023
- » **వెబ్‌సైట్:** www.ibps.in

కేజీబీవీల్లో 1241 కొలువులు



కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)లు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యూఆర్‌ఎస్)ల్లో 1241 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జూన్ 26 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోస్టుల సంఖ్య, అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష స్వరూపం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

పోస్టుల వివరాలు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), పోస్టు గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(పీజీ సీఆర్‌టీ), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టులు; అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ ఎస్)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ) పోస్టులు భర్తీ చేయనున్నారు.

మొత్తం పోస్టుల సంఖ్య: 1241

- **కేజీబీవీ-పోస్టులు 1218:** స్పెషల్ ఆఫీసర్-38, పీజీ సీఆర్‌టీ(ఇంగ్లిష్)-110, పీజీ సీఆర్‌టీ(మ్యాథమేటిక్స్)-60, పీజీ సీఆర్‌టీ(నర్సింగ్)-160, పీజీ సీఆర్‌టీ(తెలుగు)-104, పీజీ సీఆర్‌టీ(ఉర్దూ)-2, పీజీ సీఆర్‌టీ(బోటనీ)-55, పీజీ సీఆర్‌టీ(కెమిస్ట్రీ)-69,పీజీ సీఆర్‌టీ(సివిక్స్)-55, పీజీ సీఆర్‌టీ(కామర్స్)-70, పీజీ సీఆర్‌టీ(ఎకనామిక్స్)-54, పీజీ సీఆర్‌టీ(ఫిజిక్స్)-56, పీజీ సీఆర్‌టీ(జువాలజీ)-54, సీఆర్‌టీ(బయో సైన్స్)-25, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-52, సీఆర్‌టీ(హిందీ)-37, సీఆర్‌టీ (మ్యాథమెటిక్స్)-45,సీఆర్‌టీ(ఫిజికల్ సైన్స్)-42, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-26, సీఆర్‌టీ(తెలుగు)-27, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్-77.
- **యూఆర్‌ఎస్-మొత్తం పోస్టులు-23:** స్పెషల్ ఆఫీసర్-4,సీఆర్‌టీ(తెలుగు)-5, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-5,సీఆర్‌టీ(సైన్స్)-6,సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-3

విద్యార్హతలు

- **పీజీసీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ తోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి.
- **స్పెషల్ ఆఫీసర్:** కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణత సాధించాలి.
- **సీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్/పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేయాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణతఉండాలి.
- **పీఈటీ:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సర్టిఫికెట్/డిప్లొమా ఉండాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు కనీసం ఏడాది వ్యవధి ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ)లో ఉత్తీర్ణత సాధించాలి.
- కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్, సీఆర్‌టీ, పీఈటీ, పీజీసీఆర్‌టీ పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దివ్యాంగులు అనర్హులు.

వయసు

2023 జూలై 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థుల ప్రతిభ, టెట్ స్కోరు, అనుభవం ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. అన్ని పోస్టులకు రాత పరీక్షలో అర్హత సాధించాలంటే.. ఓసీ అభ్యర్థులు 40 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి. పీఈటీ పోస్టులకు రాతపరీక్షలో మార్కుల(100 శాతం వెయిటేజీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష స్వరూపం

- **పీజీసీఆర్‌టీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **స్పెషల్ ఆఫీసర్:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, స్కూల్ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **సీఆర్‌టీ:** ఇందులో కూడా మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **పీఈటీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, జనరల్ ఇంగ్లిష్‌తోపాటు ఫిజియాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, శిక్షణ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** జూలై 5, 2023
- **రాత పరీక్ష తేది:** జూలై 2023
- **వెబ్‌సైట్:** https://schooledu.telangana.gov.in

ఐఐటీల్లో కొత్త కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా విద్యార్థుల కోసం పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఐఐటీ గాంధీనగర్ బీటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును రూపొందించింది. ఐఐటీ-ఇండోర్, ఐఐటీ-పాట్నాలో బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, ఐఐటీ బాంబేలో డ్యూయల్ డిగ్రీ ఇన్ క్వాంటం టెక్నాలజీ తదితర కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలకు తగిన కోర్సు ఎంచుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల తీరుతెన్నులు, ప్రవేశం విధానం, కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..



ఐఐటీ ఇండోర్

ఈ ఏడాది ఐఐటీ ఇండోర్ ఎక్కువ సంఖ్యలో కొత్త కోర్సులను ప్రారంభించింది. బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, బీటెక్ ఇన్ మ్యాథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్, బీటెక్ ఇన్ స్పేస్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టింది. 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ ఇండోర్ ఈ కోర్సులలో ప్రవేశాలను ప్రారంభించనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ఐఐటీ పాట్నా

ఐఐటీ పాట్నా ఈ సంవత్సరం ఇంజనీరింగ్ ఫిజిక్స్‌లో కొత్తగా బీటెక్‌ను ప్రారంభించింది. ఫిజిక్స్‌లో ధ్వని శిక్షణ, విద్యార్థులకు సరికొత్త టెక్నాలజీలను పరిచయం చేయడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. సమకాలీన ఫిజిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను మిళితం చేసి విద్యార్థులను సైన్స్, టెక్నాలజీ రెండింటిలో సమాన సామర్థ్యాలుండే నిపుణులుగా తీర్చిదిద్దడమే ఈ కోర్సు లక్ష్యం.

ఐఐటీ బాంబే

ఐఐటీ బాంబే క్వాంటమ్ టెక్నాలజీలో ఇంటర్ డిసిప్లినరీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఐడీడీపీ)ను త్వరలో ప్రారంభించనుంది. ఈ కోర్సును సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ క్వాంటం ఇన్ఫర్మేషన్ కంప్యూటింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(క్యూఐసీఎస్‌టీ) ఆఫర్ చేస్తోంది. ఐఐటీ బాంబేలో ఏదైనా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(బీటెక్) కోర్సులో చేరిన విద్యార్థులు ఐడీడీపీ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవచ్చు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ నిర్మాణం ఇంకా ఖరారు కానప్పటికీ.. రెండేళ్ల కాలవ్యవధి ఉన్న ఈ కోర్సులో క్వాంటం టెక్నాలజీతోపాటు క్యూఐసీఎస్‌టీకి అనుబంధంగా ఉన్న పరిశోధనా బృందంతో చేపట్టే ప్రాజెక్ట్ వర్క్‌కు ప్రాధాన్యతనివ్వనున్నారు. ఇతర డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల మాదిరిగానే ఈ కొత్త కోర్సులో చేరిన విద్యార్థులు ఐదేళ్ల వ్యవధిలో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేస్తారు. బీటెక్ విద్యార్థులు సంబంధిత కోర్సు మూడవ సంవత్సరంలో ఈ ప్రోగ్రామ్‌ను ఎంచుకోవచ్చు.

ఐఐటీ జోధ్‌పూర్

ఐఐటీ జోధ్‌పూర్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్.. కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఫిజిక్స్ విత్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. బేసిక్ సైన్స్, అత్యాధునిక సాంకేతికతలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఈ కోర్సును తీసుకువచ్చారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణమైన స్పెషలైజేషన్ల ద్వారా వివిధ కెరీర్ మార్గాలను అందించడం ఈ కోర్సు లక్ష్యం. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోరు ఆధారంగా ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. నాలుగేళ్ల ఈ ప్రోగ్రామ్‌ను ఎనిమిది సెమిస్టర్‌లుగా విభజించారు.

ఐఐటీ హైదరాబాద్

ఐఐటీ, హైదరాబాద్.. బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్‌లో పరిశ్రమ ఆధారిత బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కోర్సును అభ్యసించే విద్యార్థులు బయోలాజికల్ డేటాను అర్థం చేసుకోవడానికి అవసరమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్‌లోనూ శిక్షణ పొందుతారు. ఇది ఎనిమిది సెమిస్టర్లు, నాలుగేళ్ల కాలవ్యవధి ఉన్న ఫుల్‌టైమ్ కోర్సు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకింగ్స్ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు.

ఐఐటీ గాంధీనగర్

ఐఐటీ, గాంధీనగర్.. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టింది. దీనిలోని కొన్ని సబ్జెక్టులు బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లోని సబ్జెక్టులతో ఉమ్మడిగా ఉన్నప్పటికీ.. చాలా సబ్జెక్టులు భిన్నంగా ఉన్నాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సును ఎంచుకోవచ్చు. ఏఐ,మెషిన్ లెర్నింగ్ లో విద్యార్థులు పట్టుసాధించేలా కరిక్యులాన్ని రూపొందించారు. అంతేకాకుండా ఎలక్టివ్స్ సౌకర్యం ఉండటంతో విద్యార్థులు ఏఐకు చెందిన వివిధ విభాగాలు, కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ తదితర అడ్వాన్స్‌డ్ ఏఐ అంశాలను ప్రత్యేకంగా ఎంచుకోవచ్చు.

ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా విద్యార్థులు పరిశ్రమలో అప్లయిడ్ ఏఐలో అద్భుత కెరీర్ సొంతం చేసుకోవచ్చు. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును నాలుగేళ్లు, ఎనిమిది సెమిస్టర్‌లుగా పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా దీనిలో ప్రవేశం కల్పిస్తారు. ఐఐటీ పాట్నా, ఐఐటీ గువాహటిలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.